# మానవత్వం పరిమళించిన వేళ

- దూరి వెంకటరావు

"పండగ దగ్గర పడుతోంది. పెద్దల్లుడికి ఉత్తరం రాశారా?" గుమ్మం వరకూ పరుగెత్తుకుంటూ వచ్చి అడిగింది సత్యవతమ్మ. ఆమె గొంతులో కంగారు ధ్వనిస్తోంది.

"నిన్ననే అల్లుళ్లిద్దరికీ ఉత్తరాలు వేసాను" అన్నాడు తాపీగా భానుమూర్తి చెప్పులు తొడుక్కుంటూ.

"చిన్నల్లుడితో మనకు సమస్యలేదు. ఎటొచ్చి పెద్దల్లుడితోనే పేచీ అంతా. ఇంతకీ అత డికివ్వవలసిన వాయిదా సిద్ధం చేసారా?"

"ఆ ప్రయత్నంలోనే ఉన్నాను" అంటూ బయటకు నడిచాడు.

భానుమూర్తికి ముగ్గురాడపిల్లలు. బిడ్డ సుఖ పడుతుందని పెద్దమ్మాయి పూర్ణిమకు తలకు మించిన సంబంధం చేసాడు. పెళ్లయి అయిదేళ్ళవుతున్నా పుట్టింది నుండి ఏదో ఒకటి పట్టుకురమ్మని భార్యని వేధిస్తూనే ఉంటాడు అజయ్. ఆమె తన పుట్టింటి వారి ఆర్థిక పరిస్థితి బావులేదంటూ ఎంత మొర పెట్టుకుంటున్నా వినిపించుకోడు సరికదా "డబ్బు లేకపోతే మీ నాన్న అంత కట్నం ఇచ్చి పెళ్లెలా చేసాడు" అంటూ ఎదురుప్రశ్న వేస్తాడు. పిలిచినా పిలవకపోయినా ఠంచన్‌గా ప్రతి పండక్కి అత్తవారింట్లో హాజరవుతాడు. అల్లుడికి ఎక్కడ ఆగ్రహం వస్తుందోనని ఉన్నంతలో అతడిని సంతృప్తి పరిచేందుకు ప్రయత్నిస్తుంటారు భానుమూర్తి దంపతులు. అలా అని అజయ్‌ది పాషాణ హృదయం అనలేం. అత్తమామలు తనకామాత్రం ముద్దుముచ్చట తీర్చ కూడదా అనేదే అతడి పంతం. పెళ్లయిన సంవత్సరం బ్లాక్ అండ్ వైట్ టీవీ, మరుసటేడు సంక్రాంతికి టైటాన్ వాచి కొనిపెట్టారు. తరువాత మోపెడ్ కావాలని మంకుపట్టు పడితే ఏం చేయాలో పాలుపోలేదు భానుమూర్తికి. తనది గవర్నమెంటు ఉద్యోగం కాదు అడ్వాన్సు పెట్టి పబ్బం గడుపుకోవడానికి. పొద్దున లేచిందగ్గర నుండి యంత్రంలా తిరగాలి. ట్యూషన్లు చెప్పడం, షాపుల్లో అకౌంట్లు రాయడం, కావలసినవాళ్లకి నచ్చచెప్పి పాలసీలు ఇప్పించడం... ఒక్కటేమిటి ఇలా సవాలక్ష పన్లు చేస్తే తప్ప దినం గడవడంలేదు. పైగా ఆ ఏడే రెండో పిల్లకి కూడా పెళ్లి చేసాడు. మెల్లగా కాలు చెయ్యి కూడదీసుకుంటూ ఉండగానే అజయ్ మరో పిడుగులాంటి ఇండెంట్ పెట్టడంతో చేసేదేంలేక మోపెడ్‌కి వాయిదాల పద్ధతి మీద డబ్బు ఇవ్వాలని నిర్ణయించుకున్నాడు భానుమూర్తి. అందుకు అల్లుడు అంగీకరించాడు. ఇప్పటికి రెండు వాయిదాలయ్యాయి. రేపు మూడో ఇన్‌స్టాల్‌మెంట్ చెల్లించవలసి వుంది.

పోతే రెండో అల్లుడి మనస్తత్వం పెద్దల్లుడితో పోలిస్తే పూర్తిగా భిన్నంగా ఉంటుందనే చెప్పాలి. ఇంతవరకూ నాకిది కావాలని ఎప్పుడూ డిమాండ్ చేయలేదు. అదే కొండంత ఊరట భానుమూర్తికి. అయితే అతడి మంచితనాన్ని అసమర్థతగా భావించి మొండి చెయ్యి చూపడం కూడా భావ్యం కాదుకదా! తనకు పూర్ణిమ ఎంతో రాధిక కూడా అంతే. అందుకే ఆ ఏడు విజయ్‌కి కూడా ఏదో ఒక మంచి వస్తువు కొనివ్వాలన్న తలంపుతో ఉన్నాడు.

కాలానికి ఎవరి సమస్యలతోనూ సంబంధంలేదు. దాని పని అది చేసుకుపోతూ వుంటుంది.

ఎల్లుండి భోగి అనగా రాధిక, విజయ్ దిగారు.

అక్క రాకతో తెగ సంబరపడిపోయింది రజని.

అల్లుడిని ఆప్యాయంగా ఆహ్వానించాడు భానుమూర్తి.

కూతురు చేతులు పట్టుకుని కుశల ప్రశ్నలు వేసింది సత్యవతమ్మ.

"అక్కా, బావ రాలేదా?" అడిగింది రాధిక అటు ఇటు కళ్ళు తిప్పుతూ.

తనకంటే ముందే బావ వచ్చి తిష్ట వేస్తాడని ఆమెకు తెలుసు. మరెందుకో ఈసారి తన అంచనా తప్పింది.

"రేపుగానీ వస్తారేమో" జవాబుగా అన్నాడు భానుమూర్తి.

"బట్టలు మార్చుకుని రండి టిఫిన్ చేద్దురుగానీ!"

సత్యవతమ్మ మాట ప్రకారం లోపలకెళ్లారు విజయ్ దంపతులు.

"ఇవాళ మనందరికీ కొత్త బట్టలు తీయమని నాన్న అమ్మకి డబ్బిచ్చారే. త్వరగా తయారవ్వు బజారుకెళదాం" అన్నది రజని. సంతోషంతో ఆ పిల్ల మొహం వెయ్యివోల్టుల బల్బులా వెలిగిపోతోంది.

"బట్టలకేం తొందర ఎప్పుడూ తీసేవేకదా! అంతకంటే మాకేమిస్తారు? బావలా నా మొగుడు డిమాండు చేసే మనిషికాదు. అందుకే అలుసు" నిష్ఠూరమాడింది రాధిక.

అక్క మాటలకు ఏం సమాధానం ఇవ్వాలో తెలీక ఊరుకుంది రజని.

"ఎందుకే అలా బాధపడతావ్? మీ నాన్న చిన్నల్లుడి మంచితనాన్ని చెప్పుకోని రోజులేదు" అంటూ ఏదో అనబోయింది సత్యవతమ్మ.

"ఔన్లే ప్రశంసలు మాకు, కానుకలు వాళ్ళకు" దెప్పి పొడుస్తున్నట్లంది రాధిక.

"అలా అనకమ్మా. మీ అక్కాచెల్లెళ్ళు ముగ్గురూ నాకు ఒకటే. ఎవరిని నిర్లక్ష్యం చేసినా బాధ ఒక్కటే. అందుకే తల్లీ ఈఏడు మీ ఆయనకి ఉంగరం చేయించి ఉంచాను" అనునయంగా అన్నాడు భానుమూర్తి.

'చేయించారులెండి పావలా ఎత్తు బోడి ఉంగరం. పన్నెండువందలు చేయదు' అని కసిగా అందామనుకుంది. మరెందుకో నోట్లో మాట నోట్లోనే ఉండిపోయింది.

కూతురేమీ మాట్లాడకపోవడంతో "నీకింకా ఏం కావాలో చెప్పమ్మా" అన్నాడు భానుమూర్తి.

రాధిక పెదవి విప్పకముందే "నువ్వింతగా అడగాలా! మామగారు చెప్పారుకదా. అవకాశం చూసుకుని ఆయనే మనకు ఏదో కొని పెడతారులే" అన్నాడు విజయ్ భార్య దూకుడుకు కళ్లెం వేస్తూ.

మరి మాట్లాడలేదు రాధిక.

చిన్నల్లుడి మంచితనాన్ని చూసి ముగ్ధురాలైంది సత్యవతమ్మ.

ఇహ భానుమూర్తి సంగతి సరేసరి. విజయ్ మంచితనాన్ని చూస్తుంటే మాటలు రావడంలేదు. పెద్దల్లుడి వాయిదాలు తీరిపోతే విజయ్‌కి ఖరీదైన వస్తువేదైనా కొనివ్వాలనుకున్నాడు. అంతలోనే అనిపించింది 'ఇది జరిగే పనేనా' అని. పెద్దల్లుడు మోపెడ్ తీసుకున్నాక ఇంకేమీ అడగడన్న గ్యారంటీ ఏముంది? తీర్చేవాడుండాలేగానీ కోరికలకు కొదవా?

★★★

మరునాడు మధ్యాహ్నం పన్నెండవుతూ ఉండగా సతీ సమేతంగా దిగాడు అజయ్.

అల్లుడి పెట్టె, బ్యాగు అందుకున్నాడు భానుమూర్తి.

అక్క కొడుకు టింకూను ఎత్తుకుని తీసుకుపోయి ఆడించసాగింది రజని.

"ప్రయాణం బాగా సాగిందా?" అడిగింది సత్యవతమ్మ నవ్వుతూ వచ్చి.

"వారంరోజులు ముందుగా వస్తారనుకున్నాం" అన్నాడు భానుమూర్తి.

"పద పద అంటూ రోజా మీ అల్లుడుగారు తొందరపెడుతూనే ఉన్నారు. ముందుగా చెల్లి చేసే దేముందంటూ నేనే తాత్సారం చేసాను."

'ఏయ్ ఏమిటా వాగుడు' అన్నట్లు భార్య చేయి నొక్కాడు అజయ్.

కిసుక్కున నవ్వింది పూర్ణిమ.

***

భోగి పండుగ రానే వచ్చింది.

అల్లుళ్లకు ఇష్టమని బొబ్బట్లు చేసింది సత్యవతమ్మ.

పీకలదాకా పిండివంటలు తిని బ్రేవ్‌మని త్రేనుస్తూ ముందుగా లేచాడు అజయ్.

భర్తకు వక్కపొడి ఇద్దామని గదిలోకెళ్లింది పూర్ణిమ.

"మీ నాన్న ఇవ్వవలసిన వాయిదా సొమ్ము అడుగు" గుర్తు చేసాడు అజయ్.

భర్త మాట జవదాటని పూర్ణిమ వంటింట్లోకెళ్లి "నాన్నగారేరమ్మా?" అని తల్లినడిగింది.

"ఇప్పుడే వస్తానంటూ పొద్దునే వెళ్లిన మనిషి ఇంతవరకూ రాలేదు. ఎక్కడికెళ్లారో ఏమిటో?" అన్నది సత్యవతమ్మ.

మాటల్లో వచ్చాడు భానుమూర్తి.

"క్షమించండి మామగారూ! మీరొచ్చేంతవరకూ ఆగలేక భోజనాలు కానిచ్చేసా. ఆకలికి తట్టుకోలేదు ఈ అల్పప్రాణి" అన్నాడు అజయ్.

"ఫర్వాలేదులేవయ్యా" అన్నాడు భానుమూర్తి నవ్వుతూ.


"పండగ పూట కూడా ఇంటి పట్టున ఉండకుండా ఎక్కడికి వెళ్లావు నాన్నా" అడిగింది పూర్ణిమ.

"ఆస్పత్రికి వెళ్లానమ్మా!"

"ఉదయం బాగానే వున్నారుగా. అంతలోనే ఏమైంది నాన్నా?" పూర్ణిమ మాటల్లో ఆందోళన గోచరిస్తోంది.

నవ్వి ఊరుకున్నాడు భానుమూర్తి.

'గతమారు పండక్కి వచ్చినప్పుడు కూడా మామగారు ఇలాగే హాస్పిటల్ వెళ్లొచ్చానన్నారు. ఈయనగారికి ఎప్పుడూ పండగల్లోనే జబ్బులొస్తాయి కాబోలు' అనుకున్నాడు అజయ్.



"ఇదిగో బాబూ! నీకివ్వవలసిన వాయిదా సొమ్ము" జేబులోంచి రెండువేలు బయటకు తీసాడు భానుమూర్తి.

"దానికేం తొందర! ముందర మీరు అన్నం తినండి. అసలే నీరసంగా ఉన్నారు" మామగారిపట్ల సానుభూతి కనబరుస్తూనే డబ్బు అందుకుని భార్య కిచ్చాడు అజయ్.

మరి మాట్లాడకుండా తిన్నగా లోపలికెళ్లి మంచం వాల్చుకున్నాడు భానుమూర్తి.

"టైము ఒంటిగంట అవుతోంది. అందరి భోజనాలు అయ్యాయి. ఇహ మీరూ నేనే మిగిలాం. లేవండి" అంటూ భర్తను లేపింది సత్యవతమ్మ.

"వడ్డించు వస్తాను" అన్నాడు భానుమూర్తి మెల్లగా లేస్తూ.

"అవునూ... నిన్నటిదాకా వాయిదా సొమ్ము ఎలా చెల్లించాలా అన్నారు. ఇప్పటికిప్పుడు డబ్బెలా వచ్చిందండీ" అనుమానం వ్యక్తం చేసింది సత్యవతమ్మ.

"అల్లుడి సంగతి నీకు తెలీనదేముంది? డబ్బివ్వక పోతే ఊరుకుంటాడా? పండగపూట రాద్ధాంతం దేనికని హాస్పిటల్‌కి వెళ్లి బ్లడ్‌బ్యాంకుకు నా రక్తాన్నిచ్చాను. ఆ డబ్బే ఇప్పుడు అల్లుడికిచ్చింది."

"ఏమిటండీ ఈ పని? అసలే నీరసంగా ఉన్నారు. ఉన్న రక్తం కాస్తా ఇచ్చేస్తే మీ ఆరోగ్యం ఏం కాను?" కంట తడిపెడుతూ ఆందోళన వ్యక్తం చేసింది సత్యవతమ్మ.

"ఏ దారీ కనిపించకే అలా చేసాను. భయపడకు. నిరుడు కూడా రక్తాన్ని అమ్మే అల్లుడి వాయిదా చెల్లించాను. ఏమైపోయాను చెప్పు? మనిషి ఆరోగ్యంగా ఉంటే తప్ప రక్తం తీసుకోమన్నా వాళ్ళు తీసుకోరు" ఓదార్పుగా అన్నాడు భానుమూర్తి.

అప్పుడే బయటకొచ్చిన అజయ్ ఆ మాటలు విన్నాడు. అతడి హృదయం చలించిపోయింది. జలగలు, నల్లులు మనుషుల రక్తాన్ని పీల్చుకుని జీవిస్తాయంటారు. మరి నేను చేస్తున్న పనేమిటి? వాటికంటే నికృష్టంగా బతుకుతున్నానా? పశ్చాత్తాపంతో అతడి మనసు దహించుకుపోతోంది. చేసిన పాపానికి పరిహారం వాంఛిస్తోందతని మనసు.

వెంటనే మామగారి దగ్గరకువెళ్లి "మీరు ఎంతో శ్రమపడి ఇద్దరాడపిల్లలకి పెళ్లిళ్ళు చేసారు. వాళ్ళ ముద్దుముచ్చట తీర్చడంకోసం రెక్కలు ముక్కలు చేసుకున్నారు. ఇక మీదట మీరు నిశ్చింతగా ఉండండి. ఎంత ఖర్చయినా రజని పెళ్లి నేను చేస్తాను. ఇది మీ అల్లుడి పండగనాటి ప్రమాణం. ముందీ డబ్బుతో మందులు కొనుక్కుని మీ ఆరోగ్యం కాపాడుకోండి" పుచ్చుకున్న సొమ్ము వాపస్ చేస్తూ అన్నాడు అజయ్.

ఉన్నఫళంగా పెద్దల్లుడిలో వచ్చిన మార్పుకు విభ్రాంతి చెందారు భానుమూర్తి దంపతులు.

అది మానవత్వం పరిమళించిన వేళ!

★